


ముగిసిన బ్రహ్మోత్సవాలు

గంగాపురం లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ముగిశాయి.

వివరాలు 8లో ▸



కలియుగ వైకుంఠం..

మన్యంకొండ వెంకన్న బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.5 /15.2

చల్లని గాలులు వీయడంతోపాటు మంచు కురుస్తుంది. రాత్రి చలి ఎక్కువగా ఉంటుంది. ఎండ ప్రభావం చూపిస్తుంది.

'రియల్' మోసాలు



ఒకే ప్లాట్‌ను పలువురికి విక్రయం

- డబుల్ రిజిస్ట్రేషన్లతో బురిడీ కొట్టిస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు
- ఇల్లు నిర్మించుకునే సమయంలో అసలు విషయం వెలుగులోకి..
- ఇబ్బందులు పడుతున్న ప్లాట్ల కొనుగోలుదారులు
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు.. పలువురిపై కేసులు
- జిల్లాలో ఆరు నెలల్లో 60కి పైగా ఫిర్యాదులు

గద్వాల క్రైం: సొంతింటి కలను అవకాశంగా మార్చుకొని కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు మోసాలకు తెరలేపుతున్నారు. ఒకే ప్లాట్‌ను ఒకరికి తెలియకుండా మరొకరికి రిజిస్ట్రేషన్ చేయడం.. ప్రభుత్వ స్థలాన్ని సైతం కప్పి పుచ్చి విక్రయించడం .. చివరికి ఇల్లు నిర్మించుకునే సమయంలో ఈ స్థలం మాదంటే.. మాది అంటూ ఒకరిపై ఒకరు గొడవకు దిగడం.. చివరికి పంచాయితీ పోలీసుల వద్దకు వెళ్లగా మోసపోయినట్లు తెలిసి పలువురు బాధితులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో ఇటీవల పలువురు బాధితులు పోలీసులను ఆశ్రయిస్తుండగా రియల్ మాయగాళ్ల మోసాలు వెలుగులోకి వస్తున్నాయి. గద్వాల, అలంపూర్ సెగ్మెంట్లలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వెంచర్‌లు ఏర్పాటు చేసి సామాన్య ప్రజలను నిలువునా మోసం చేస్తున్నారు. పోలీసుశాఖ నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్లాట్ల క్రయ విక్రయాలపై జరిగిన మోసాలపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఆరు నెలల వ్యవధిలో 60కు పైగా ప్లాట్ల మోసాలపై ఫిర్యాదులు వచ్చాయంటే తీవ్రత అర్థమవుతోంది.

కొనే ముందు జాగ్రత్తలు తప్పనిసరి



వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసే క్రమంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రభుత్వ నిబంధనలు పరిగణలోకి తీసుకోవాలి. సర్వే నంబర్ల ద్వారా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఈసీలో నిర్దేశించిన వివరాలు వెలుగులోకి వస్తాయి. గ్రామ పంచాయతీ, మున్సిపల్, డీటీడీసీ అనుమతి తదితర అనుమతులు కలిగిన వెంచర్లు ఏవో తెలుసుకోవాలి. బాధితుల ఫిర్యాదులపై విచారణ చేపట్టి మోసం చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నాం. భూ సంబంధ కేసులు, సివిల్ సమస్యలను కోర్టు ద్వారా పరిష్కారం చేసుకోవాల్సిందిగా ప్రజలకు తెలియజేస్తున్నాం.

– శ్రీనివాసరావు, ఎస్పీ

జిల్లాలో కొన్ని సంఘటనలు..



పోలీస్ గ్రీవెన్స్‌లో బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ (ఫైల్)

■ 2025 జనవరి 19వ తేదీన గద్వాల పట్టణంలోని మైనార్టీ కులానికి చెందిన ఓ వ్యక్తి ధరూర్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారితో పట్టణ శివారులోని రెండు ప్లాట్లను రూ.25లక్షలు వెచ్చించి కొనుగోలు చేశాడు. అయితే కొన్ని రోజుల తర్వాత ఇంటి నిర్మాణ పనులు మొదలు పెట్టేందుకు యజమాని స్థలం వద్దకు వెళ్లగా.. ఈ భూమి ప్రభుత్వ స్థలమని, ఇక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా చర్యలు తప్పవని బోర్డు కనిపించింది. దీంతో జరిగిన మోసంపై బాధితుడు సదరు వ్యాపారిని ప్రశ్నించగా వేరే చోట ఉన్న స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసి స్తానని నమ్మబలికాడు. దీంతో తనకు జరిగిన అన్యాయంపై బాధితుడు పోలీసులను ఆశ్రయించగా అతని ఫిర్యాదు మేరకు రియల్ ఎస్టేట్ వ్యాపారిపై పట్టణ పోలీసు స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదు చేశారు.

■ 2024 నవంబర్ 22వ తేదీన గద్వాల మండలానికి చెందిన ఓ మహిళ గద్వాల పట్టణంలోని ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి వద్ద రూ.2.50లక్షలకు ప్లాట్ కొనుగోలు చేసింది. అయితే కొన్ని నెలల తర్వాత ప్లాట్‌కు సంబంధించిన పత్రాలు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఈసి తీయగా అప్పటికే ఇద్దరు వ్యక్తులపై ప్లాట్ రిజిస్ట్రేషన్ అయి ఉంది. దీంతో సదరు వ్యాపారిని మహిళ నిలదీయగా.. మరో చోట స్థలం రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామని చెప్పాడు. నేడు రేపు అంటూ కాలయాపన చేయడంతో బాధితురాలు న్యాయం చేయాలని పట్టణ పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించింది. దీంతో సదరు వ్యాపారిపై చీటింగ్ కేసు నమోదు చేశారు.

■ 2025 ఫిబ్రవరి 3వ తేదీన శాంతినగర్‌కు చెందిన ఓ వ్యక్తి అయిజ పట్టణంలోని ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి వేసిన వెంచర్‌లో రెండు ప్లాట్లను రూ.59లక్షలకు కొనుగోలు చేశాడు. అయితే రిజిస్ట్రేషన్ చేయించడంలో రోజులు, నెలలు కాలయాపన చేస్తూ వచ్చాడు. ఎక్కడో మోసం జరిగిందని గ్రహించి విషయాన్ని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లాడు. ఈ విషయమై విచారణ చేయించాల్సిందిగా ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

■ 2024 డిసెంబర్ 12వ తేదీన జిల్లా కేంద్రంలోని న్యూ హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన ఓ వ్యక్తి పట్టణానికి చెందిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారితో రూ.50లక్షలు వెచ్చించి ప్లాట్ కొనుగోలు చేశాడు. అయితే రిజిస్ట్రేషన్ సమయంలో అసలు విషయం తెలిసింది. ఈ స్థలాన్ని రోడ్డు నిర్మాణం నిమిత్తం ప్రభుత్వం సేకరించి.. సదరు వ్యాపారికి నష్టపరిహారం సైతం చెల్లించింది. ఈ విషయాన్ని దాచి తనను మోసం చేశాడని పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. అలాగే, కొందరు వెంచర్ల నిర్వాహకులు ఒక ప్లాట్‌ను ఇద్దరికి విక్రయించి మోసాలకు పాల్పడుతున్నారు. వెంచర్‌లో ప్లాట్ కొనుగోలు చేసిన వ్యక్తికి కేవలం ప్లాట్ నంబర్ మాత్రమే కేటాయించడం రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కలిసి వస్తుంది. రిజిస్ట్రేషన్ సమయంలో సంబంధిత అధికారులు గుర్తించినా వారితో లోపాయికారి ఒప్పందం చేసుకొని రిజిస్ట్రేషన్లు చేసి పంపించేస్తున్నారు. ఎప్పుడైతే వారు ఇల్లు నిర్మించుకునేందుకు వెళ్తారో అప్పుడు మోసాలు బయటకు పడుతున్నాయి. ఇలా జిల్లా కోర్టులో ఎన్నో కేసులు విచారణ దశలో ఉన్నాయి. ఇప్పటికైనా నిబంధనలు కఠినతరం చేయాలని.. మరొకరు మోసపోకుండా దోషులను చట్టప్రకారం శిక్షించాలని.. బాధితులకు న్యాయం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

న్యూస్‌రీల్

డిమాండ్ ఉన్న ఉత్పత్తులను కొనుగోలు చేయాలి

గద్వాల: ప్రామాణికంగా గుర్తింపు పొందిన ఉత్పత్తులను మాత్రమే కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు అన్నారు. గురువారం ఐడీవోసీ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ ద్వారా సంబంధిత రంగాలకు ప్రమాణాలను తెలుసుకోవడం, డౌన్‌లోడ్ చేసుకునే విధానాన్ని సంబంధిత ప్రతినిధులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివరించారు. అనంతరం అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు మాట్లాడుతూ ప్రామాణిక ఉత్పత్తుల నాణ్యతా తనిఖీలు, మార్కెట్‌లోని నాసిరకం ఉత్పత్తులను నియంత్రించే చట్టాల గురించి అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. బిస్ యాప్ ద్వారా వినియోగదారులకు ఉత్పత్తుల ప్రమాణాలు, హాల్మార్క్, లైసెన్స్ వివరాలు రిజిస్ట్రేషన్ నంబర్లను సులభంగా తనిఖీ చేసుకోవచ్చన్నారు. ఈ యాప్ ద్వారా వినియోగదారుల నాణ్యమైన ఉత్పత్తులను ఎంపిక చేసుకోగలరన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

సెకండ్ ఏఎన్‌ఎంల హామీలు నెరవేర్చాలి

గద్వాల: సెకండ్ ఏఎన్‌ఎంలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. గురువారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత సంవత్సరం 2024 సెప్టెంబర్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రెగ్యూలర్ చేయాలని సెకండ్ ఏఎన్‌ఎంలు నిరవధిక సమ్మె చేయగా కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు సమ్మెకు మద్దతు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీని పూర్తిగా విస్మరించారని మండిపడ్డారు. ఇప్పటికైన ఇచ్చిన హామీని నిలబెట్టుకుని సెకండ్ ఏఎన్‌ఎంల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం సెకండ్ ఏఎన్‌ఎంలతో కలిసి డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్ధప్పకు వినతిపత్రం అందజేశారు.

'త్రిఫ్ట్ ఫండ్'పై ఆంక్షలు వద్దు

అమరచింత: రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రవేశపెట్టిన త్రిఫ్ట్ ఫండ్ పథకం అమలుపై ఆంక్షలు విధించడం సరికాదని అమరచింత చేనేత సహకార సంఘం అధ్యక్షుడు మహంకాళి చంద్రమోహన్ అన్నారు. గురువారం పట్టణంలోని చేనేత సహకార సంఘంలో కార్మికులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. గత ప్రభుత్వం ప్రతి మగ్గానికి ముగ్గురు కార్మికులను ఎంపిక చేసి పథకం వర్తింపజేసిందని.. జియో ట్యాగింగ్ కూడా చేసిందని తెలిపారు. కొత్త ప్రభుత్వం చేనేత సంక్షేమ పథకాలు కొనసాగిస్తామంటూనే త్రిఫ్ట్ ఫండ్ ఒక మగ్గానికి ఇద్దరు మాత్రమే అర్హులని ప్రకటిస్తూ జీఓ ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అమరచింత సొసైటీలో 300 మగ్గాలు ఉన్నాయని, 900 మంది చీరల తయారీపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం కండెలు చుట్టే వారికి త్రిఫ్ట్ ఫండ్ వర్తించదని చెప్పడంతో 300 మంది వీధినపడే ప్రమాదం ఉందన్నారు. పథకంలో ఉన్న వారికే చేనేత బీమా వర్తిస్తుందని చెబుతున్నారని.. ప్రతి కార్మికుడికి న్యాయం జరిగేలా ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. బ్యాంకులో వ్యక్తిగత రుణాలతో పాటు చేనేత రుణాలు పొందితే వెంటనే పునరుద్ధరించుకోవాలని సూచించారు.

మోదీ, చంద్రబాబు మెప్పు కోసమే దళితుల విభజన



మాట్లాడుతున్న జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణ అంశం అసెంబ్లీలో పూర్తిగా అశాస్త్రీయమైనదని, సుప్రీం కోర్టు తీర్పునకు విరుద్ధంగా వర్గీకరణ చేపట్టారని జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి అండగా నిలబడిన మాలలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మోసం చేశారని అన్నారు. వర్గీకరణకు పూర్తిగా మద్దతు ఇచ్చిన బీజేపీ.. వారు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ఎందుకు వర్గీకరణ అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఈ విషయం సీఎం రేవంత్ రెడ్డికి తెలియదా అని అన్నారు. మోదీ, చంద్రబాబుల మెప్పు కోసమే రేవంత్‌రెడ్డి దళితులను విభజించారని ఆరోపించారు. 2011 జనాభా లెక్కలలో ఉపకులాల గణన జరగలేదని, తప్పుడు జనాభా లెక్కలతో వర్గీకరణ చేశారని అన్నారు. తెలంగాణ ఏర్పడి 11 ఏళ్లు దాటిన తర్వాత పాత లెక్కలను ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ వర్గీకరణ జరగడమే శాస్త్రీయం కాదని, మాలల జనాభాను పూర్తిగా తక్కువ చేసి చూపించారని ఆరోపించారు. దీనిపై న్యాయ పోరాటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. మాలలకు జరుగుతున్న అన్యాయంపై గడపగడపకు వెళ్లి పోరాట చైతన్యాన్ని నింపుతామని తెలిపారు. సమావేశంలో జాతీయ ప్రధాన కార్యదర్శి బైరి రమేష్, రాష్ట్ర కోఆర్డినేటర్ బ్యాగరి వెంకటస్వామి, జిల్లా అధ్యక్షుడు జి.చిన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ గోనెల ఆనంద్, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్, నాయకులు రవికుమార్, ఆంజనేయులు, యాదయ్య, శ్రీనివాస్, రవి, హరిప్రసాద్, సహదేవ్, సూర్య, రాజు, కిరణ్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి సమష్టి కృషి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల: గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థుల విద్యాభివృద్ధి, ఆరోగ్యాభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి, ఇంటర్ విద్యార్థులు మధ్యలో చదువు ఆపేసిన విద్యార్థులు తిరిగి వారిని పాఠశాలలు, కళాశాలలో చేర్పించేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. రక్తహీనత నివారణ కోసం రక్తపరీక్షలు నిర్వహించి విద్యార్థులకు సరైన పోషణ అందేలా చూడాలన్నారు. అలాగే, గ్రామీణ మహిళలను ఆరోగ్యపరంగా బలోపేతం చేయడం ద్వారా పిల్లల్లో తలెత్తే వివిధ రకాల ఆరోగ్య సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించవచ్చన్నారు. బాల్యవివాహాల నిరోధం, ఆడపిల్లలకు 18ఏళ్లు, మగపిల్లలకు 21 ఏళ్లు నిండిన తరువాతనే వివాహం చేయాలని దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రధానంగా గట్టు, కె.టి.దొడ్డి మండలాల్లో ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టాలన్నారు. 15–18ఏళ్ల వయసు కీలక దశ కావడంతో ఆ దశలో పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ ఎంతో ముఖ్యమన్నారు. గ్రామీణ మహిళా సంఘాలు ప్రభుత్వ అనుకూల అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు, మురళీకృష్ణ, నర్సింహులు, గ్రామ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలి



మల్దకల్‌లో శివస్వాముల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఆదిత పరాశ్రీ స్వామిజీ

మల్దకల్: హిందూ ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆదిత్య పరాశ్రీ స్వామిజీ భక్తులకు సూచించారు. గురువారం మల్దకల్ ఆదిశిలా క్షేత్రంలో శివస్వాముల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనానికి ఆయన హాజరై భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. మారుతున్న కాలానుగుణంగా ప్రతి ఒక్కరూ దైవచింతనను కలిగి ఉండి ఆధ్యాత్మికంపై దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా సనాతన ధర్మాన్ని కాపాడుకునేందుకు హిందువులంతా ఏక తాటిపైకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇంట్లో ఉన్న దేవుడు ఇంటిల్లిపాదిని కాపాడితే, గుళ్లో ఉన్న దేవుడు లోకాన్ని రక్షిస్తాడన్నారు. యువత చెడు వ్యసనాలు వీడి సన్మార్గంలో నడవాలని, ప్రాచీన కాలం నుంచి వస్తున్న హిందూ సాంప్రదాయాలు ఎంతో గొప్పవని, వాటన్నింటిని కాపాడుకోవాల్సిన బాధ్యత నేడు మనందరిపై ఉందన్నారు. అంతకు ముందు ఆదిశిలా క్షేత్రంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా సంయోగ్ జగదీశ్వర్‌రెడ్డి, విహెచ్‌పీ నాయకులు దేవేందర్ రాజు, ఓబులేష్, రామాంజనేయులు, గోవిందు, రెడ్డప్ప, కిష్టన్న, రంగస్వామి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు , తిరుమలేష్, దుర్గాప్రసాద్, మల్దకల్, శివస్వాములు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ క్రాప్ బుకింగ్ పక్కాగా నిర్వహించాలి



వివరాలు తెలుసుకుంటున్న డీఏఓ సక్రియానాయక్

గద్వాల వ్యవసాయం: పంట నమోదులో భాగంగా డిజిటల్ క్రాప్ బుకింగ్‌ను పకడ్బందీగా చేయాలని డీఏఓ సక్రియానాయక్ ఆదేశించారు. గురువారం మండలంలోని వీరాపురం, జమ్మిచేడు శివారులో చేస్తున్న డిజిటల్ క్రాప్ బుకింగ్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విస్తరణ అధికారులతో వివరాలు తెలుసుకొని మాట్లాడారు. ప్రతి సర్వే నెంబర్‌లో పంట నమోదును డిజిటల్ క్రాప్ బుకింగ్ యాప్‌లో చేయాలని, రైతులు సాగు చేసిన పంటలకు అనుగుణంగా ఎరువులు సమకూర్చుకోవడం, దిగుబడి ఆధారంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయానికి ఈ వివరాలు ఉపయోగపడతాయని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకొని పక్కాగా చేయాలన్నారు. రైతులు కూడా సహకరిస్తూ, పూర్తి సమాచారం అందించాలని కోరారు. ఏడీఏ సంగీతలక్ష్మీ, ఏఓ ప్రతాప్‌కుమార్, ఏఈఓలు ప్రవళిక, రవికుమార్‌లు ఉన్నారు.

అధికారుల ఒత్తిళ్లకు తలొగ్గం



దీక్షలో పాల్గొన్న ఆయా గ్రామాల ప్రజలు

రాజోళి: మండలంలోని పెద్దధన్వాడ గ్రామంలో ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా కొనసాగుతున్న దీక్ష గురువారం 15 వరోజుకు చేరింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఫ్యాక్టరీకి సంబంధించిన ఆస్తులకు చిన్న పాటి నష్టం కలిగినా తమపై కేసులు నమోదు చేస్తున్నారని, రెవెన్యూ, పోలీసు అధికారులు తమపై దీక్షలు విరమించాలని ఒత్తిడి చేస్తున్నారని అన్నారు. కాని తమ జీవనోపాధిగా ఉన్న వ్యవసాయాన్ని వదిలి ఫ్యాక్టరీని గ్రామంలో ఏర్పాటు చేయనివ్వమని అన్నారు. రానున్న భవిష్యత్తు పిల్లలదేనని అలాంటి వారికి అవసరమయ్యే వసతులను కోల్పోయే విధంగా ఫ్యాక్టరీ నిర్మాణం జరుగుతుందని, అలాంటి మహమ్మారిని గ్రామంలోకి రానివ్వమని అన్నారు. కార్యక్రమంలో పెద్ద ధన్వాడతో పాటు ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

యూపీఎస్ విధానాన్ని సంఘటితంగా వ్యతిరేకిద్దాం



అలంపూర్‌లో పోస్టర్ ఆవిష్కరిస్తున్న స్థితప్రజ్ఞ, నాయకులు

అలంపూర్: కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు ప్రవేశపెట్టబోయే యూపీఎస్ విధానాన్ని సంఘాలకు అతీతంగా వ్యతిరేకిద్దామని సీపీఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ పిలుపునిచ్చారు. గురువారం అలంపూర్ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆయన, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, జిల్లా సీపీఎస్ నాయకులతో కలిసి మార్చి 2న నిర్వహించే చలోధర్నా, సీపీఎస్ యుద్ధభేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం స్థితప్రజ్ఞ మాట్లాడుతూ... ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీన కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు కొత్త సీపీఎస్ విధానం అమలు చేయనుందని, ఈ విధానాన్ని ఆదిలోనే వ్యతిరేకించాలన్నారు. సంఘాలు సంఘటితంగా వ్యతిరేకించకపోతే 20 ఏళ్ల క్రితం పరిస్థితులు పునరావృతం అవుతాయని అన్నారు. పదవీ విరమణ అయ్యే ఉద్యోగులకు నెలకు రూ.2 వేల నుంచి రూ.4 వేల వరకు చాలీచాలని పింఛన్ ఇస్తారని అన్నారు. ఉద్యోగులంతా ఏకమై మార్చిన 2న హైదరబాద్ ధర్నా చౌక్‌లో జరిగే సీపీఎస్ యుద్ధభేరికి పెత్తఎత్తున తరలివచ్చి ప్రభుత్వాలకు మన ఆవేదన తెలియజేద్దామన్నారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడిని జిల్లా నాయకులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణు, జిల్లా అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు రమేష్ కుమార్, ప్రతాప్ రెడ్డి, కృష్ణ, అమరేందర్ రెడ్డి, శ్రీనివాసులు, నాగరాజు, జగదీష్, మస్తా ఆయా శాఖల ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాలీబాల్ అకాడమీ.. అటకెక్కించారు!

మెయిన్ స్టేడియంలో మూడేళ్ల క్రితం పునఃప్రారంభం

- రెండేళ్ల క్రితం రాష్ట్రస్థాయి ఎంపికలు సైతం పూర్తి
- అంతటితోనే ఆగిపోయిన ప్రక్రియ
- అకాడమీలో క్రీడాకారుల ప్రవేశాలపై సందిగ్ధం?



వాలీబాల్ అకాడమీ కోర్టులు

మహబూబ్‌నగర్ క్రీడలు: ఔత్సాహిక వాలీబాల్ క్రీడాకారులను ప్రోత్సహించడానికి 2004లో రాష్ట్ర క్రీడాప్రాధికారిక సంస్థ పాలమూరు జిల్లాకు వాలీబాల్ అకాడమీని మంజూరు చేసింది. నాలుగేళ్ల పాటు నడిచిన అకాడమీలో జిల్లా క్రీడాకారులు ఎంతో ప్రతిభ చాటారు. దీంతో అప్పట్లో ఈ వాలీబాల్ అకాడమీకి రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు వచ్చింది. ఇక్కడ శిక్షణ పొందిన జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయి వాలీబాల్ క్రీడాకారులుగా ఎదిగారు. వీరు మొదట్లో అకాడమీలో వాలీబాల్‌లో ఓనమాలు నేర్చుకొని దేశానికి ప్రాతినిథ్యం వహించేస్థాయికి ఎదిగారు. పలువురు క్రీడాకారులు జాతీయ సీనియర్ వాలీబాల్ పోటీల్లో రాష్ట్రానికి ప్రాతినిథ్యం వహించారు. అయితే నిధుల నిర్వహణ భారంతో 2008లో ఈ అకాడమీని మూసివేశారు.

మూడేళ్ల క్రితం వసతుల ఏర్పాటు..

జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో వాలీబాల్ అకాడమీని తిరిగి ఏర్పాటు చేయాలని డిమాండ్ పెరగడంతో.. మూడేళ్ల క్రితం వాలీబాల్ అకాడమీ తిరిగి పునఃప్రారంభమైంది. రూ.19.70 లక్షల నిధులతో స్టేడియం ఆవరణలోని స్విమ్మింగ్‌పూల్ కాంప్లెక్స్ గదులను అకాడమీ క్రీడాకారుల వసతి కోసం కేటాయించారు. గదుల ఆధునికీకరణ పనులు చేపట్టి పూర్తి చేశారు. మంచాలు, టేబుల్స్, బీరువాలతో పాటు క్రీడాకారుల వసతి కోసం ఇతర వస్తువులను కూడా సిద్ధంగా ఉంచారు. స్టేడియంలోని రెండు పాత వాలీబాల్ కోర్టులను తీసి వేసి వాటి స్థానంలో నూతన కోర్టులు ఏర్పాటు చేశారు. కోర్టుల చుట్టూ నాలుగు ఫ్లడ్ లైట్లు, ప్రత్యేక షెడ్లు, గ్యాలరీ ఏర్పాటు చేశారు. గోడ చుట్టూ ఆకర్షణీయంగా వాలీబాల్ క్రీడాచిత్రాలను తీర్చిదిద్దారు.

ప్రవేశాలపై సందిగ్ధం?

మెయిన్ స్టేడియంలో ఏర్పాటు చేసిన నూతన వాలీబాల్ అకాడమీలో ప్రవేశాల కోసం 2022 డిసెంబర్ 1వ తేదీన రాష్ట్రంలోని అండర్ 14–18 ఏళ్ల బాలబాలికలకు ఎంపికలు నిర్వహించారు. ఈ సెలక్షన్స్‌లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 187 మంది బాలురు, 46 బాలికలు.. మొత్తం 233 మంది ఔత్సాహిక క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ కనబరిచిన వారిని అకాడమీకి ఎంపిక చేయాల్సి ఉంది. అయితే సెలక్షన్ నిర్వహించి రెండేళ్లు దాటినా.. క్రీడాకారులకు ప్రవేశాలు కల్పించలేదు. కోచ్‌ల నియామకాలు కూడా జరగలేదు. ఒకవేళ అకాడమీ ప్రారంభిస్తే.. గతంలో జరిగిన సెలక్షన్స్‌లో ప్రతిభ చాటిన వారికి ప్రవేశాలు ఇస్తారా లేదా మళ్లీ కొత్తగా సెలక్షన్స్ నిర్వహిస్తారా అనే దానిపై సందిగ్ధం ఏర్పడింది.

■ వాలీబాల్ అకాడమీ ఏర్పాటు చేయడం వల్ల ఔత్సాహిక క్రీడాకారులకు మహర్దశ కలుగుతుంది. నిష్ణాతులైన కోచ్‌ల పర్యవేక్షణలో బాలబాలికలకు మెరుగైన శిక్షణ అందజేసి రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచేలా తీర్చిదిద్దుతారు. అయితే మూడేళ్ల క్రితమే అకాడమీ తిరిగి ప్రారంభమైనా ప్రవేశాలు కల్పించకపోవడంపై సీనియర్ క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వచ్చే విద్యాసంవత్సరంలోనైనా ప్రవేశాలు కల్పించాలని సీనియర్లు కోరుతున్నారు.

గ్రామీణ క్రీడాకారులు వెలుగులోకి వస్తారు..



మహబూబ్‌నగర్‌లో గతంలో ఉన్న వాలీబాల్ అకాడమీలోనే నేను ఓనమాలు నేర్చుకున్న. అకాడమీ నుంచి అంచెలంచెలుగా ఎదిగి అంతర్జాతీయస్థాయి మ్యాచుల్లో ఆడాను. స్పోర్ట్స్ కోటాలో ఇన్‌కమ్ టాక్స్ శాఖలో ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగం కూడా వచ్చింది. వాలీబాల్ హాస్టళ్లు, అకాడమీ ఏర్పాటయితే నాలాంటి ఎంతోమంది గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులు వెలుగులోకి వస్తారు.

– యశ్వంత్‌కుమార్, అంతర్జాతీయ క్రీడాకారుడు, మహబూబ్‌నగర్

త్వరలో ప్రవేశాలు



వాలీబాల్ అకాడమీలో ప్రవేశాల గురించి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణకు నివేదిక ఇచ్చాం. అనుమతులు రాగానే అకాడమీ సెలక్షన్స్, ప్రవేశాలు నిర్వహిస్తాం. అకాడమీ ఏర్పాటు తో నైపుణ్యం గల క్రీడాకారులను వెలికి తీయవచ్చు. క్రీడాకారులకు మెరుగైన వసతి, ఉత్తమమైన శిక్షణ లభిస్తుంది.

– ఎస్.శ్రీనివాస్, డీవైఎస్‌ఓ, మహబూబ్‌నగర్

వేరుశనగ క్వింటా రూ.5,550



గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్‌యార్డుకు గురువారం 555 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్టం రూ.5550, కనిష్టం రూ.3229, సరాసరి రూ.5411 ధరలు పలికాయి. అలాగే, 140 క్వింటాళ్ల కంది రాగా గరిష్టం రూ.6806, కనిష్టం రూ.2019, సరాసరి రూ.6809 ధరలు వచ్చాయి. 8 క్వింటాళ్ల ఆముదాలు రాగా గరిష్టం రూ. 5529, కనిష్టం రూ. 5502, సరాసరి రూ. 5519 ధరలు లభించాయి.

క్లుప్తంగా

ఈతకు వెళ్లి బాలుడు మృతి


రఫి (ఫైల్)

రాజోళి: స్నేహితులతో కలిసి సరదాగా సుంకేసుల డ్యాంలో ఈతకు వెళ్లిన ఓ బాలుడు ప్రమాదవశాత్తు నీట మునిగి మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. రాజోళికి చెందిన మహ్మద్ కుమారుడు రఫి(16) స్థానిక ఉర్దూ పాఠశాలలో చదువుకుంటున్నాడు. కాగా గురువారం తన స్నేహితులతో కలిసి కర్నూలు జిల్లా సుంకేసుల వైపు ఉన్న పుష్కర ఘాట్ వద్ద ఈతకు వెళ్లాడు. అయితే స్నేహితులు అందరూ ఒడ్డుకు వచ్చినా రఫి కనిపించలేదు. దీంతో గల్లంతయ్యాడని గుర్తించిన స్నేహితులు అక్కడే ఉన్న గజఈతగాళ్ల సహాయంతో నదిలో వెతకగా కొద్దిసేపటి తర్వాత బాలుడి మృతదేహం లభించింది. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు బోరున విలపించారు. అయితే బాలుడి తండ్రి గతంలోనే మృతిచెందాడు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ దుర్మరణం

ఎర్రవల్లి: రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతిచెందిన ఘటన ఎర్రవల్లి మండలం నారాయణపురం స్టేజీ సమీపంలోని ఎన్‌హెచ్–44పై గురువారం చోటు చేసుకుంది. కోదండాపురం ఎస్‌ఐ స్వాతి వివరాల మేరకు.. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లాకు చెందిన ప్రసాద్ (45) తన మినీ డీసీఎంతో హైదరాబాద్‌కు బయల్దేరాడు. మార్గమధ్యంలోని నారాయణపురం స్టేజీ సమీపంలో రోడ్డుపై మొక్కలకు నీరు పోస్తున్న హైవే వాటర్ ట్యాంకర్‌ను ప్రమాదవశాత్తు ఢీకొట్టడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని డీసీఎం క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన మృతదేహాన్ని బయటికి తీసి, పోస్టుమార్టం నిమిత్తం కర్నూల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని మరొకరు..

దేవరకద్ర రూరల్: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన బుధవారం రాత్రి బల్సుపల్లి సమీపంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నాగన్న కథనం ప్రకారం.. ఓబ్లాయపల్లి గ్రామానికి చెందిన వెంకట్రాములు(38) మేస్త్రీ పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. రోజూ లాగే తన భార్య పద్మతో కలిసి అజిలాపూర్‌లో పని ముగించుకొని ద్విచక్రవాహనంపై ఇంటికి బయలుదేరారు. అయితే బల్సుపల్లి సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో వెంకట్రాములుకు తీవ్ర గాయాలు కాగా, భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు ఇద్దరిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ వెంకట్రాములు మృతిచెందాడు. ఈ విషయమై వెంకట్రాములు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

వ్యక్తి బలవన్మరణం

కోడేరు: ఉరేసుకొని ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన చిన్నరాజు (40) తన భార్యతో తరచూ గొడవ పడేవాడు. దీంతో మనస్థాపానికి గురై బుధవారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకొని మృతి చెందాడు. చిన్నరాజుకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

కోడోనిపల్లి శివారులో మరో వ్యక్తి..

అమ్రాబాద్: చెట్టుకు ఉరేసుకొని ఓ వ్యక్తి బలవన్మరణం చెందిన సంఘటన శుక్రవారం పదర మండలం కోడోనిపల్లి గ్రామ శివారులో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి ఎస్‌ఐ సద్దాం హుస్సేన్ కథనం ప్రకారం.. బల్మూరు మండలం జినుకుంట గ్రామానికి చెందిన శంకర్‌గౌడ్(52) పదర మండలం కోడోనిపల్లి తమ బంధువుల ఇంటికి గురువారం సాయంత్రం వచ్చాడు. శుక్రవారం ఉదయం భోజనం అనంతరం ఇంటికి వెళ్తానని చెప్పి బయలుదేరాడు. అయితే సాయంత్రం గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకొని మృతిచెందగా.. స్థానిక రైతులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు అక్కడికి చేరుకొని పంచనామా నిర్వహించారు. ఈ ఘటనపై శంకర్‌గౌడ్ భార్య సాయిలీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని అమ్రాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు.

వివాహిత అనుమానాస్పద మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: అనుమానాస్పదస్థితిలో ఓ వివాహిత మృతిచెందిన ఘటన మండలంలోని శ్రీపురం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ గోవర్ధన్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన చిట్టెమ్మ (38) కూలి పని చేసుకుంటూ జీవనం సాగించేది. చెరువులో ఆమె మృతదేహం గుర్తించిన గ్రామపంచాయతీ సిబ్బంది కుటుంబసభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఘటన స్థలానికి చేరుకొన్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు. భర్తపై అనుమానం ఉన్నట్లు చిట్టెమ్మ అన్న బంగారయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

కలియుగ వైకుంఠం.. మన్యంకొండ

నేటి నుంచి లక్ష్మీవేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

- 12న స్వామివారి రథోత్సవం
- ఏర్పాట్లు పూర్తిచేసిన దేవస్థానం నిర్వాహకులు


మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి వారు

మహబూబ్‌నగర్ రూరల్: ఉమ్మడి జిల్లాలోనే పేరెన్నికగన్న శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం కలియుగ వైకుంఠంగా బాసిల్లుతోంది. తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధికెక్కింది. కొలిచిన వారికి కొంగు బంగారమై విరాజిల్లుతోంది. ఇంతటి విశిష్టత గల మన్యంకొండ లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 7నుంచి మార్చి 16వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఉత్సవాల్లోని ప్రధాన ఘట్టమైన స్వామివారి రథోత్సవం 12వ తేదీ రాత్రి జరగనుంది. అందుకు గాను దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

తెలంగాణ తిరుపతిగా..

మహబూబ్‌నగర్ నుంచి 17 కిలో మీటర్ల దూరంలో రాయచూర్ అంతర్రాష్ట్ర రహదారి పక్కన ఎత్తైన గుట్టలపై మన్యంకొండ దేవస్థానం కొలువుదీరింది. స్టేజీ నుంచి మూడు కిలోమీటర్ల మేర ఘాట్‌రోడ్డు మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. తిరుపతికి మన్యంకొండకు చాలా దగ్గరి పోలికలు ఉండటంతో తెలంగాణ తిరుపతిగా మన్యకొండను పిలుస్తారు. ఆర్థిక స్థోమత లేని భక్తులు మన్యంకొండకు వచ్చి స్వామి వారిని దర్శించుకుంటే.. తిరుపతికి వెళ్లినంత పుణ్యం లభిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. కొన్ని వందల సంవత్సరాల చరిత్ర గల స్వామి దేవస్థానం దినదినాభివృద్ధి చెందుతూ భక్తుల ఇలవేల్పు దైవంగా మారింది. తవ్వని కోనేరు, చెక్కని పాదాలు, ఉలి ముట్టని స్వామి ఇక్కడి ప్రత్యేకం.


మన్యంకొండ శిఖరం

కార్యక్రమాలు ఇలా..

- 7వ తేదీన కోటకదిర గ్రామంలోని అళహరి వంశీయుల ఇంటి నుంచి స్వామివారి ఉత్సవ మూర్తిని గుట్టపైకి ఊరేగింపుగా తీసుకువచ్చి ఉత్సవాలకు శ్రీకారం చుడతారు. రాత్రి స్వామివారి తిరుచ్చి సేవ నిర్వహిస్తారు.
- 8న హంసవాహన సేవ
- 9న గజవాహన సేవ
- 10న సూర్యప్రభ వాహన సేవ
- 11న హనుమ వాహన సేవ, ప్రభోత్సవం
- 12న గరుడ వాహనసేవ, అర్ధరాత్రి తర్వాత రథోత్సవం
- 13న అశ్వవాహనసేవ, ద్వితీయ ప్రభోత్సవం
- 14న శేషవాహనంపై స్వామివారి దర్బార్ సేవ
- 15న శేషవాహన సేవ,
- మార్చి 8న స్వామివారిని కొండపై నుంచి కోటకదిర గ్రామానికి తరలిస్తారు.
- మార్చి 12 నుంచి 16వ తేదీ వరకు దిగువ కొండ వద్ద కొలువుదీరిన శ్రీ అలివేలు మంగ తాయారు ఉత్సవాలు కొనసాగుతాయి. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన అమ్మవారి తిరుకల్యాణ మహోత్సవం 14న మధ్యాహ్నం 12గంటలకు జరగనుంది. దీంతో స్వామివారి ఉత్సవాలు ముగుస్తాయి.

స్వామివారి సేవలో అళహరి వంశీయులు..

మన్యంకొండ స్వామివారి సేవలో అళహరి వంశీయులు తరిస్తున్నారు. అళహరి అనంతయ్య, కేశవయ్య, రంగయ్య, వెంకయ్య, పాపయ్య, హనుమద్దాసు, మేఘయ్య, అనంతయ్య, రామయ్య, వెంకటస్వామి, నారాయణస్వామి విశేష సేవలు అందించారు. ప్రస్తుతం అదే వంశానికి చెందిన అళహరి మధుసూదన్‌కుమార్ వంశపారంపర్య ధర్మకర్తగా కొనసాగుతున్నారు. దేవస్థానం స్థాపనకు కృషి చేసిన అళహరి వంశీయుల వంశవృక్షానికి తెలియజెప్పే చిత్రపటం దేవస్థానంలో ఏర్పాటు చేశారు. కొంతమంది ఫొటోలను కూడా ఏర్పాటు చేశారు.

ప్రతి సంవత్సరం స్వామివారి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు.

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం..



మన్యంకొండ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం. దేవస్థానం అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు అన్నివిధాలా సహకరిస్తున్నారు. – అళహరి మధుసూదన్‌కుమార్, చైర్మన్, మన్యంకొండ దేవస్థానం

హనుమద్దాసుల కీర్తనలతో ఖ్యాతి..

అళహరి వంశానికి చెందిన హనుమద్దాసుల వారి కీర్తనలతో మన్యంకొండ ఖ్యాతి గడించింది. హనుమద్దాసుల వారు స్వామికి పూజలను పునఃప్రారంభించి.. దాదాపు 300 కీర్తనలు రచించారు. ఈ కీర్తనలు అప్పట్లో అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. దేవస్థానం చరిత్రను చాటిచెప్పాయి. హనుమద్దాసుల కృషిని తెలుసుకున్న గద్వాల, వనపర్తి సంస్థానాధీశులు మన్యంకొండకు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అంతేకాకుండా స్వామివారి ఉత్సవాలకు తమవంతు ధర్మంగా అన్ని ఏర్పాట్లు చేశారు. ఏనుగులతో స్వామివారికి సేవా కార్యక్రమాలు నిర్వహించే వారు. స్వామివారు నిజంగా ఉన్నారని నిరూపించడానికి హనుమద్దాసుల వారు ఎన్నో పనులు చేసి చూపించారు. అప్పట్లో ఆయన దేవస్థానం వద్ద కోనేరును తవ్వించడంతో పాటు పెద్దగుడి గంటను కూడా ఏర్పాటు చేశారు. హనుమద్దాసుల తర్వాత ఆయన వంశానికి చెందిన అళహరి రామయ్య దేవస్థానం వద్ద ప్రారంభించారు. వంశపారంపర్య ధర్మకర్తగా ఉండడంతో పాటు దేవస్థానం అభివృద్ధికి ఎంతో కృషి చేశారు.

దేవస్థానం చరిత్ర..

దాదాపు 600 ఏళ్ల క్రితం తమిళనాడులోని శ్రీరంగం సమీపంలో ఉన్న అళహరి గ్రామ నివాసి అళహరి కేశవయ్య కలలో శ్రీనివాసుడు కనిపించి, కృష్ణా నదీ తీర ప్రాంతంలోగల మన్యంకొండపై తాను వెలసి ఉన్నానని.. అక్కడికి వెళ్లి నిత్య సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించి అంతర్ధానం అయ్యారని పురాణం చెబుతోంది. శ్రీనివాసుడి సూచన మేరకు అళహరి కేశవయ్య తన తండ్రి అనంతయ్య, కుటుంబ సభ్యులతో కలిసి మన్యంకొండ సమీపంలోని కోటకదిరలో నివాసం ఏర్పర్చుకున్నారు. దక్షిణాది గల దివ్యక్షేత్రాలను ఆయన దర్శించుకుంటూ.. ఒక రోజు కృష్ణానదిలో స్నానమాచరించిన అనంతరం సూర్యభగవానుడికి నమస్కరించి, దోసిలితో అర్ఘ్యం వదులుతున్న సమయంలో చెక్కని శిలా రూపంలో గల వేంకటేశ్వరస్వామి విగ్రహం నదిలో అలల ద్వారా వచ్చి కేశవయ్య దోసిలిలో నిలిచింది. ఆ విగ్రహాన్ని మన్యంకొండపై శేషషాయి రూపంలోగల గుహలో ప్రతిష్ఠించి.. నిత్య దూప దీప నైవేద్యాలతో స్వామిని ఆరాధించడం ప్రారంభించారు. అంతేకాకుండా దేవస్థానం మండపంలో ఆంజనేయస్వామి, గరుడ్వాలర్ విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ దేవస్థానం సమీపంలో మునులు తపస్సు చేయడంతో మన్యంకొండగా ప్రసిద్ధికెక్కింది. దేవస్థానం ఎదురుగా ఉన్న గుట్టపై అప్పట్లో మునులు తపస్సు చేసిన గుహ ఇప్పటికీ ఉంది. కొన్నేళ్ల పాటు మన్యంకొండపై పూజలు జరిగాయి. ఆ తర్వాత కొన్ని రోజులకే పూజలు ఆగిపోయాయి.


మునులు తపస్సు చేసిన గుహ

ముగిసిన చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు


పూర్ణాహుతి క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు

జడ్చర్ల టౌన్: మండలంలోని గంగాపురం లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ముగిశాయి. ఉదయం వేదపండితుల మంత్రోచ్ఛారణలు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులతో నిత్య హోమం జరిపించి మహా పూర్ణాహుతి సమర్పించారు. అనంతరం ధ్వజ అవరోహణం చేసి ఆలయ ప్రాంగణంలో స్వామివారి ఉత్సవ విగ్రహం ఉంచి చక్రతీర్థ సేవ జరిపించారు. అలాగే ద్వాదశ ఆరాధనలు, పుష్పయాగం, నాగబలి, దేవత ఉద్వాసన, సప్తవర్ణ సేవలు నిర్వహించారు. ఉత్సవాలు ముగిసినప్పటికీ భక్తులు మాత్రం ఆలయానికి భారీగా తరలివస్తున్నారు. బ్రహ్మోత్సవాలు విజయవంతం కావడానికి సహకరించిన అధికారులు, ఆలయ సిబ్బంది, గ్రామస్తులకు పాలకమండలి సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

22న గంప జాతర..

గంపజాతరను ఈ నెల 22న నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు ప్రకటించారు. ఉత్సవాలు ముగిసిన తర్వాత వచ్చే రెండో శనివారం గంపజాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. రెండేళ్లకు ఓసారి పడమర ప్రాంత భక్తులు గంపలు తలపై పెట్టుకొని కాలినడకన ఆలయానికి చేరుకుంటారు. సొంత గ్రామంలో ఎత్తుకున్న గంపను ఎక్కడ దించకుండా నేరుగా ఆలయానికి చేరుకుంటారు. గంపజాతర ఉన్న ఏడాదిలో ఉత్సవాలకు వచ్చే భక్తుల సంఖ్య స్వల్పంగా తగ్గుతుంది.


చక్రతీర్థ కార్యక్రమం

స్పందించే గుణం.. కవుల సొంతం


విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

- చిన్నారులను కళల్లో ప్రోత్సహించాలి
- పాటల్లో సుద్దాల సజీవం
- ప్రముఖ సినీ రచయిత సుద్దాల అశోక్ తేజ
- ముగిసిన సుద్దాల హనుమంతు సాంస్కృతిక ఉత్సవాలు


మాట్లాడుతున్న సినీ రచయిత సుద్దాల అశోక్ తేజ

స్టేషన్ మహబూబ్‌నగర్: కవులు, కళాకారులు అంటేనే స్పందించే గుణమని ప్రముఖ సినీ రచయిత సుద్దాల అశోక్ తేజ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న సుద్దాల హనుమంతు సాంస్కృతిక ఉత్సవాలు గురువారం ముగిశాయి. చివరి రోజు నిర్వహించిన వేడుకలకు సుద్దాల అశోక్ తేజ ముఖ్య అతిథిగా హాజరై తన ప్రసంగంతో ఆకట్టుకున్నారు. తాను రచించిన పాటలను పాడి యువత, విద్యార్థులను ఉత్సాహపరిచారు. కొమ్మ ఉయ్యాల...కోన జంపాలా.. అమ్మ ఒడిలోనే రోజు ఊగాలా.. కొమురం భీముడో పాటలతో పాటు ఇతర పాటలు పాడారు. ఇలా పాటలు రాసుకుంటూ సుద్దాల హనుమంతు బిడ్డగా ఆయన బాటలోనే నడుస్తున్నట్లు తెలిపారు. సినిమాల్లోకి రాకముందే తాను 2వేల ప్రజల, ప్రైవేటు పాటలు రాసినట్లు చెప్పారు. కవులు స్పందించి కవితలను రాస్తారన్నారు. పేదలు పాడుకునే పాటల్లో, నేటి యువత జరుపుకొంటున్న ఉత్సవాల్లో సుద్దాల హనుమంతు సజీవంగా ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం యువత దేశానికి విలువైన ఆస్తి అని.. అత్యున్నత లక్ష్యాలను నిర్దేశించుకొని ముందుకుసాగాలని సూచించారు. అనంతరం యువ కళాకారులు ప్రదర్శించిన కళారూపాలను తిలకించి అభినందించారు. ఇంత వైభవంగా ఉత్సవాలు జరుగుతున్నట్లు తనకు తెలిస్తే సుద్దాల రక్త సంబధీకులను తీసుకువచ్చేవాడినని తెలిపారు.



అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు..

జానపద నృత్యాలు, వెస్టన్ డాన్స్, కవి సమ్మేళనం, లఘు నాటికలు, చిత్రలేఖనం, బతుకమ్మ, ఏకపాత్రాభినయం అందరినీ అలరించాయి. విద్యార్థులు, యువత ఉత్సవాల్లో పాల్గొని తమ ప్రతిభను చాటారు. ఆయా అంశాల్లో గెలుపొందిన వారికి జ్ఞాపికలు, మెడల్స్‌తో సత్కరించారు. ఉత్సవాల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రశంసా పత్రాలను అందించి ప్రోత్సహించారు. కార్యక్రమంలో సుద్దాల హనుమంతు ఉత్సవాల వేదిక గౌరవాధ్యక్షులు డా.మధుసూదన్‌రెడ్డి, అధ్యక్ష, కార్యదర్శులు బెక్కం జనార్దన్, కురుమూర్తి, సలహాదారులు సురభి జగపతిరావు, డా.రామ్మోహన్, డా.ప్రతిభ, ఉపాధ్యక్షులు కురుమయ్య, ఆర్.ప్రమోద్‌కుమార్, వి.పద్మ, రాము, కవులు వల్లభాపురం జనార్దన, ఖాజా మైనుద్దీన్, కొప్పోలు యాదయ్య, కేపీ లక్ష్మీనారాయణ, బోల యాదయ్య, పీయూ తెలుగు విభాగాధిపతి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

రెండు తులాల బంగారం, రూ.50 వేలు చోరీ

లింగాల: మండలంలోని అప్పాయపల్లిలో ఓ కుటుంబం బీరువాలో దాచి ఉంచిన 2 తులాల బంగారం, రూ.50 వేలు నగదు చోరీకి గురైన ఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఎండీ ఫరీదా బేగం ఈ నెల 1వ తేదీన బీరువాలో 2 తులాల బంగారం, రూ.74 వేలు నగదును ఉంచి తాళం వేసింది. తాళం చెవులను బ్యాగ్‌లో దాచి పెట్టింది. ఈ నెల 6న డబ్బులు అవసరం కాగా బ్యాగ్‌లో తాళం చెవి చూడగా కన్పించలేదు. దీంతో ఆందోళనకు గురై బీరువాను పరిశీలించగా రెండు తులాల బంగారం, రూ. 50 వేలు నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు.

పిల్లలతో సహా తల్లి అదృశ్యం

లింగాల: మండల కేంద్రానికి చెందిన వివాహిత పిల్లలతో సహా అదృశ్యమైంది. ఎస్‌ఐ నాగరాజు వివరాల మేరకు.. లింగాలకు చెందిన శ్రీకాంత్, సౌజన్య (25)కు కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే కుటుంబ కలహాలతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. పెద్దల సూచన మేరకు సౌజన్యను తన తల్లిగారింటి వద్ద ఉంచారు. అక్కడ కూడా గొడవలు జరగడంతో గత నెల 25న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా సౌజన్య తన ఇద్దరు పిల్లలతో కలిసి వెళ్లిపోయింది. ఆమె కోసం కుటుంబ సభ్యులు వెతికినప్పటికీ ఫలితం లేకపోయింది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పిచ్చికుక్క స్వైర విహారం.. 8 మందికి గాయాలు

అయిజ: పుర కేంద్రంలోని వివిధ కాలనీల్లో గురువారం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. పట్టణానికి చెందిన ఏడుగురు, మండలంలోని దేవబండకు చెందిన ఒకరిపై దాడి చేసింది. పాత పోలీస్‌స్టేషన్ కాలనీకి చెందిన పదేళ్ల బాలుడు హరికృష్ణ ముఖానికి గాయాలుకాగా.. చేతి వేలు విరిగింది. అదేకాలనీకి చెందిన అహ్మద్, లక్ష్మి, సుజాత, నిషాంత్, శంకర్, ఉదయ్‌కుమార్‌కు, దేవబండకు రాముడికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్ర గాయాలైన హరికృష్ణను కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి.. మిగిలిన వారికి పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స అందించారు. పిచ్చికుక్క స్వైర విహారంతో పట్టణ ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భూత్పూర్: మున్సిపాలిటీలోని గోప్లాపూర్‌కు చెందిన పోతురాజు కాశన్న (61) చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. గోప్లాపూర్‌కు చెందిన పోతురాజు కాశన్నతో ఈ నెల 3న అతడి దయాదులైన పోతురాజు రాములు, రాజారాం, యాదయ్య పొలం విషయంలో గొడవ పడ్డారు. ఈ క్రమంలో కాశన్నను నెట్టివేయడంతో తలకు రక్తగాయమైంది. కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కుమారుడు నర్సింహులు ఫిర్యాదు మేరకు పోతురాజు యాదయ్య, రాజారాం, రాములుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కల్లు సీసాలో ఎలుక

బిజినేపల్లి: కల్లు సీసాలో ఎలుక కనిపించిన ఘటన మండలంలోని గుడ్లనర్వలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామంలోని ఒక ఇంట్లో శుభకార్యం ఉండటంతో కల్లు ప్రియుల కోసం కల్లు సీసాలను తీసుకొచ్చారు. ఓ సీసాలో ఎలుక ఉండటం గుర్తించి దానిని బయటికి తీసే ప్రయత్నం చేయగా మూతి భాగంలోనే ఉండిపోయింది. ఈ విషయాన్ని ఎక్సైజ్‌శాఖ అధికారి సతీశ్‌రెడ్డి వద్ద ప్రస్తావించగా.. కల్లు దుకాణం నుంచి నమూనాలు సేకరించామని, కల్లును పారబోశామన్నారు. పూర్తిస్థాయిలో విచారణ చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.


కల్లు సీసాలో ఇరుక్కుపోయిన ఎలుక

కొండాపూర్‌లో చిరుత కలకలం

నవాబుపేట: మండలంలోని కొండాపూర్‌కు చెందిన రైతు యాదయ్య పొలంలో ఉన్న మేకపై బుధవారం రాత్రి చిరుత దాడిచేసింది. మేకలు ఒక్కసారిగా అరవడంతో పరిసరాల్లో ఉన్న రైతులు టార్చిలైట్లు వేస్తూ వెళ్లారు. మేకను చంపేసిన చిరుత వారిని చూసి అడవిలోకి పారిపోయింది. మేక కళేబరాన్ని చూసిన రైతులు భయాందోళనకు గురై గ్రామానికి చేరుకొని అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు.

ఇద్దరి ప్రాణాలు తీసిన అతివేగం

- ఆగి ఉన్న డీసీఎంను ఢీకొట్టిన బైక్
- ఇద్దరు మెడికల్ విద్యార్థుల దుర్మరణం


శశాంక్ (ఫైల్)


జ్ఞానేశ్వర్ (ఫైల్)

మహబూబ్‌నగర్ క్రైం: అతివేగం, అజాగ్రత్త ఇద్దరి ప్రాణాలను తీసింది. ఆగి ఉన్న డీసీఎంను బైక్ ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు మెడికల్ విద్యార్థులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్ వివరాల మేరకు.. నారాయణపేట జిల్లా కేంద్రానికి చెందిన ఎస్.శశాంక్ (19), దేవరకొండ మండలం మల్లెపల్లికి చెందిన జ్ఞానేశ్వర్ (19) పాలమూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో బీఎస్సీ ఎలైయిడ్ సైన్స్ ఫస్ట్ ఇయర్‌లో చేరారు. వీరిద్దరు స్నేహితులు కావడంతో జిల్లా కేంద్రంలోని షాషాబ్‌గుట్టలో ఓ గదిని అద్దెకు తీసుకుని ఉంటున్నారు. గురువారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో ట్యాబ్లెట్ తెచ్చుకోవడానికి న్యూటౌన్‌లో ఉన్న మెడికల్ దుకాణానికి బైక్‌పై వెళ్తూ.. ప్రధాన రహదారిపై నిలిచి ఉన్న డీసీఎంను ఢీకొట్టారు. ప్రమాదంలో వారిద్దరికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను మార్చురీకి తరలించారు. అయితే హైదరాబాద్ నుంచి డీసీఎంలో లోడ్‌తో మహబూబ్‌నగర్‌కు చేరుకున్న డ్రైవర్ వెంకటేష్‌కు నిద్ర రావడంతో రోడ్డుపైనే నిలిపి డీసీఎంలోనే నిద్రించాడు. డీసీఎంకు కనీసం పార్కింగ్ లైట్స్, రేడియం స్టిక్కర్స్ లేకపోవడంతో, గమనించని ఇద్దరు విద్యార్థులు బైక్‌పై వేగంగా వచ్చి వెనక నుంచి ఢీకొట్టారు. జరిగిన ప్రమాదాన్ని చూస్తే డీసీఎం డ్రైవర్‌తో పాటు యువకుల తప్పిదం కూడా ఉన్నట్లు స్పష్టమవుతుంది. అర్ధరాత్రి వేళ కావడం.. రోడ్డు నిర్మానుష్యంగా ఉండటంతో యువకులు బైక్‌పై అతివేగంగా వచ్చినట్లు తెలుస్తోంది. మరోవైపు ఇద్దరికి హెల్మెట్ లేకపోవడంతో తల పగిలి దుర్మరణం చెందారు. హెల్మెట్ ఉంటే కచ్చితంగా ప్రాణపాయం ఉండేది కాదని పోలీసులు చెబుతున్నారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు డీసీఎం డ్రైవర్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.


ఘటనా స్థలంలో విద్యార్థుల మృతదేహాలు

- పాలమూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో బీఎస్సీ ఎలైయిడ్ సైన్స్ విద్యార్థులకు గురువారం ఓరియేంటేషన్ క్లాస్ ఉంది. మృతిచెందిన యువకులు సైతం ఉదయం క్లాస్‌కు వెళ్లాల్సి ఉండగా.. రోడ్డు ప్రమాదానికి గురై మృత్యువు ఒడిలోకి వెళ్లారు. మృతి చెందిన ఇద్దరు విద్యార్థుల ఆత్మ శాంతి కోసం తరగతి గదిలో విద్యార్థులు రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు.